క్లుప్తంగా

గవర కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా



రుక్మిణి

విజయనగరం: రాష్ట్ర గవర సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన విజయనగరానికి చెందిన ఆడారి రుక్మిణి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి కారణంగా తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. తనకు గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కి, ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్‌లో వైఎస్సార్‌సీపీలో కొనసాగుతూ పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని పేర్కొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

డెంకాడ: మండలంలోని డెంకాడ శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదువంటే మాకు ఇష్టం ' కార్యక్రమం నిర్వహించారు. పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను లైబ్రేరియన్ వై.మహేష్ విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో కథలు, విజ్ఞానశాస్త్ర పుస్తకాలను చదివించారు. క్యారమ్స్, లూడో తదితర గేమ్స్ ఆడించారు. విద్యార్థుల్లో పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ తెలిపారు.

అమ్మవారికి అభిషేకాలు



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో అర్చకులు ఆరవెల్లి రవిశర్మ, మణికంఠశర్మ నేతృ త్వంలో అమ్మవారికి ఆదివారం పంచామృతాభిషేకాలు చేశారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యే కత కలిగిన రోజు కావడంతో తెలవారు ఝామున 5 గంట లకే అభిషేకాలు చేశారు. అనంత రం అమ్మవారిని భక్తులు దర్శనం కోసం అలంకరించా రు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాష్, వైస్ చైర్మన్ సూరు కుమార్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో మధ్యాహ్నం దేవస్థానం ప్రాంగణంలో అన్నదానం చేశారు.


పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



మొక్కలు నాటుతున్న యువకులు

వేపాడ: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మండలంలోని జగ్గయ్యపేట గ్రామ యువకులు మొక్కలు నాటు తున్నారు సోంపురం-వేపాడ ప్రధాన రహదారిలో జగ్గయ్యపేట పైడితల్లమ్మ గుడి నుంచి అరిగిపాలెం వరకు రోడ్డుకు ఇరువైపులా ఆదివారం మొక్కలు నాటారు. యువకులు మాట్లాడుతూ గతేడాది రోడ్డుకు ఇరువైపులా బాదం, నేరేడు, ఉసిరి, తురాయి మొక్కలను నాటామని, వాటిలో చనిపోయిన వాటి స్థానంలో మళ్లీ మొక్కలు నాటుతున్నట్లు పేర్కొన్నారు.

నవధాన్యాల కిట్లు పంపిణీ



పంపిణీకి నవధాన్యాల ప్యాకెట్లను సిద్ధం చేస్తున్న మహిళలు

రేగిడి: మండలంలోని అంబకండి, గుళ్లపాడు, ఉంగరాడ, రేగిడి, చాటాయవలస గ్రామాల్లోని రైతులకు నవధాన్యాల కిట్లు ఆదివారం పంపిణీ చేశారు. రాయితీ పోను ఒక్కో కిట్‌ను రూ.350కు అందించినట్లు ప్రకృతి వ్యవసాయం పీఆర్‌పీ రమాదేవి తెలిపారు. అనంతరం నవధాన్యాలు సాగు చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రధాన పంట సాగుకు ముందు నవధాన్యాలు పొలాల్లో వేసుకుని, మొక్కలైన తర్వాత నేలలో దున్నేయాలని తద్వారా నేల సారవంతమై పంటలు బాగా పండుతాయని తెలిపారు. చీడపీడలు, తెగుళ్లను సమర్థంగా ఎదుర్కొనే శక్తి పంటకు లభించడంతో పాటు నేల నుంచే పంటకు కావాల్సిన పోషకాలు లభిస్తాయన్నారు. ఆరోగ్యవంతమైన పంట అధిక దిగుబడులు వస్తాయన్నారు.

జోరుగా 'ఉపాధి'

- 22 గ్రామ పంచాయతీల్లో ముమ్మరంగా ఉపాధి పనులు
- హాజరవుతున్న 5185 మంది వేతనదారులు
- గరిష్ట వేతనం రూ.300కు పెంపుతో వేతనదారుల్లో హర్షం



వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరావు

విజయనగరం రూరల్: మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం(ఎన్‌ఆర్‌ఈజీఎస్) పనులు జోరందుకున్నాయి. గ్రామస్తులు, రైతులకు ఉపయోగపడేలా చెరువుల, సాగునీటి కాలువల్లో పూడికల తొలగింపు, రహదారులు, కల్వర్టుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను గుర్తించి చేపడుతున్నారు. ప్రతిరోజు సుమారు 5 వేలకు పైగా వేతనదారులు పనుల్లో పాల్గొంటున్నారు. 126 శ్రమశక్తి సంఘాల ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నారు. రోజువారీ గరిష్ట వేతనాన్ని ప్రభుత్వం రూ.300లకు పెంచడంతో వేతనదారులు ఉత్సాహంగా పనుల్లో పాలొంటున్నారు. పనుల గుర్తింపు, బిల్లుల మంజూరు, కూలీలకు చెల్లింపుల్లో పారదర్శకత కోసం ఎన్‌ఐసీ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులో ఉండటంతో ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు అడ్డుకట్ట పడింది.

33 పనులు మంజూరు

మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో ఆమోదం పొందిన 33 పనులను ప్రస్తుతం చేపడుతున్నారు. 126 శ్రమశక్తి సంఘాల ఆధ్వర్యంలో 5185 మంది వేతనదారులు పనుల్లో పాల్గొంటున్నారు. ఆయా గ్రామాల్లో సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఈ ఏడాది కనీస వేతనాన్ని రూ.272 నుంచి రూ.300లకు పెంచడంతో పనిలో పాల్గొనే వేతనదారుల సంఖ్య పెరిగింది.



పనుల్లో పాల్గొన్న వేతనదారులు

ఉద్యానవన పనులు మంజూరు

ఉద్యానవన పంటల సాగుకు ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేయడంతో రైతులకు మరింత మేలు కలగనుంది. పండ్ల తోటల నిర్వహణ, ఫారం పాండ్ల ఏర్పాటుకు అవకాశం ఉపాధి నిధులు ఖర్చు చేయనున్నారు. రైతులకు వందశాతం రాయితీపై వివిధ రకాల పండ్ల మొక్కలు అందించడంతో పాటు మూడేళ్ల పాటు తోటల సాగుకు అవసరమైన ఖర్చులను అందించనున్నారు. మామిడి, డ్రాగన్ ఫ్రూట్, సపోటా, ఇతర పంటల సాగుకు ఉపాధి పథకం వర్తిస్తుందని, 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు దీనికి అర్హులు.

పారదర్శకంగా పనులు

ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టే పనుల్లో పారదర్శకత పెరిగింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త యాప్ ద్వారా అక్రమాలకు అడ్డుకట్ట పడింది. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. జాబ్‌కార్డు లేనివారికి వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. పని ప్రదేశంలో వేతనదారులకు మౌలిక వసతులు కల్పించేలా సిబ్బందికి సూచనలు చేశాం. ఉద్యాన పంటల సాగుకు ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేయడంతో పండ్ల తోటలు సాగుచేసే రైతులు దీన్నివినియోగించుకోవాలి.

– గంటా వెంకటరావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీఓ, ఎంపీడీఓ, విజయనగరం మండలం

ఆశాజనకంగా నువ్వు పంట సాగు



ఆతవలో సాగులో ఉన్న నువ్వు పంట

వేపాడ: మండలంలో నువ్వు పంట సాగు ఆశాజనకంగా ఉంది. గత వారంలో కురిసిన వర్షా లు ఈ పంటకు మేలు చేశాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మండలంలో సుమారు 867 హెక్టార్లలో ఈ పంటను సాగులో ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పంట ప్రస్తుతం పూతకు వచ్చింది. మరికొద్ది రోజుల్లో పంట చేతికందనుంది.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గజపతినగరం హైస్కూల్ 1992-93 పదోతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో 1992–93వ సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆపాఠశాల వేదికగా ఆదివారం జరిగింది. పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసుకుని వేర్వేరు ప్రాంతాల్లో చదువుకుని వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా మూడు దశా బ్దాల తర్వాత మళ్లీ కలుసుకున్నారు.ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు, తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడిగా గడిపారు. అప్పట్లో వారికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

మురుగునీటితో అవస్థలు



ప్రధాన రహదారిపై నిల్వ ఉన్న మురుగునీరు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని నెల్లిమర్ల-రణస్థలం ప్రధాన రహదారిలో దేవుని నెలివాడ గ్రామం వద్ద మురుగునీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలను కలిపే రహదారి కావడంతో ప్రతి నిత్యం ఈ మార్గంలో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. గ్రామంలో కాలువలు లేకపోవడంతో ఇళ్లల్లో వాడుక నీరంతా ప్రధాన రహదారి పైకి చేరి నిల్వ ఉంటోంది. దీంతో స్థానికులతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగునీరు మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు రోజులు తాగునీరు బంద్

శృంగవరపుకోట: నియోజకవర్గ ప్రధాన కేంద్రం శృంగవరపుకోట పట్టణానికి రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలిపేస్తున్నట్టు తాటిపూడి వాటర్ వర్క్స్ జేఈ శైలజ ఆదివారం తెలిపారు. తాటిపూడి వాటర్ పైప్‌లైన్‌లో పలు చోట్ల లీకులు ఉన్నందున వాటిని మరమ్మతులు చేసేందుకు రెండు రోజులు మెయింటెనెన్స్ వర్క్స్ చేస్తున్నట్టు చెప్పారు. మంగళవారం, బుధవారం రెండు రోజులు ఈమరమ్మతులు చేయించనున్నందున రెండు రోజులు తాగునీటి సర ఫరా ఉండదని, సమస్యని గుర్తించి, ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

13న పాఠశాలల పునఃప్రారంభం

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను ఈనెల 13వ తేదీన పునఃప్రారంభించనున్నట్లు ఎంఈఓ ఎం.వెంకటరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పాఠ్య,నోట్ పుస్తకాలను అన్ని పాఠశాలలకు చేరవేశామని పేర్కొన్నారు. పాఠశాలలు తెరిచిన తర్వాత తరగతుల వారీగా విద్యార్థులకు పుస్తకాలు అందజేయనున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

రేగిడి: స్థానిక విశ్వసాయి మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వక్త, హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావాలను ప్రతిఒక్కరూ పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమన్నారు. మానవసేవే మాధవసేవ అని, ఏమీ లేని వారికి మనకు తోచిన సాయం చేయాలన్నారు. మంచి పనులు చేసిన వారికి తప్పకుండా మోక్షం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రుత్విక్కులు వేమకోటి ప్రసాద్‌శర్మ, అంపోలు రామ్‌ప్రసాద్‌శర్మ, వేమకోటి జానకీరామ్‌శర్మ పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి అమ్మవారి పండగ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ దంపతులు



అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు

గజపతినగరం/గజపతినగరం రూరల్: మండలంలోని బూడిపేటలో గ్రామదేవత మహంకాళి అమ్మవారి పండగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బూడిపేట, దావాల పేట గ్రామస్తులు ఒక్కో ఏడాది ఒక గ్రామం వారు అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవా యితీగా వస్తోంది. గతేడాది దావాలపేట గ్రామస్తులు పండగ నిర్వహించగా, ఈ ఏడాది బూడిపేట గ్రామస్తులు చేశారు. అమ్మవారికి రెండు గ్రామాల భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

ఎమ్మెల్యే దంపతుల పూజలు

అమ్మవారిని స్థానిక ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్, లక్ష్మీసింధు దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి తదితరు లు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



ఎల్.కోట మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- అధైర్యపడొద్దు
- గెలుపోటములు సర్వసాధారణం
- ఎల్.కోట మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి

కొత్తవలస: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయామని అధైర్యపడాల్సిన పనిలేదని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అర్జన్నపాలెం గ్రామసమీపంలోని తన క్యాంపు ఆఫీస్‌లో లక్కవరపుకోట మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల తో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞత లు తెలిపారు. ప్రస్తుతం పార్టీకి ఇది కష్టకాలమని, అయినా ఎవరూ అధైర్యపడవద్దని, ఎప్పుడు ఎవరికి ఏ అవసరం వచ్చినా తనను కలవచ్చని చెప్పారు. తాము అధికా రంలోకి వస్తే సూపర్‌సిక్స్‌తో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ, కూటమి నాయకులు హామీలు ఇచ్చారని, వాటిని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కంటే ఇంకా ఎక్కువ సంక్షేమ పథకాలు ఇస్తామని కూటమి ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మి ఓట్లు వేశారని, వారిని మోసం చేయకుండా చంద్రబాబునాయుడు పాలన చేయాలని అన్నారు. వైఎస్సార్‌సీపీకి గ్రామస్థాయిలో మంచి ఓటు బ్యాంకు ఉందని, మళ్లీ కష్టపడి పని చేసి ప్రజలకు అందుబా టులో ఉంటూ మళ్లీ పుంజుకొని ముందుకు పోదామని పిలుపునిచ్చారు. అంతా కలిసి పార్టీ పూర్వవైభవానికి కృషి చేయాలని సూచించారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ శ్రీనురాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

నేడు పరదేశమ్మ తొలేళ్ల ఉత్సవం

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేటలో గ్రామదేవత పరదేశమ్మ అమ్మవారి పండగలో భాగంగా సోమవారం తొలేళ్ల ఉత్సవం నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు,కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. అమ్మవారి పండగను 15 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు, మంగళవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పండ్ల తోటల సాగులో ఆదర్శం

- పండ్లతోటల సాగులో రాణిస్తున్న రైతు జగన్నాథం
- ఏడెకరాలను లీజుకు తీసుకుని పండ్ల తోటలు, పూల సాగు
- అంతర పంటలతో అదనపు ఆదాయం



సాగులో ఉన్న జామి పంట



జామిలో అంతరపంటగా సాగుచేస్తున్న కర్బూజ



ఎనిమిది నెలల్లో కాపు వచ్చిన అలహాబాద్ సఫేజ్ రకం జామి మొక్కలను చూపిస్తున్న రైతు జగన్నాథం

వేపాడ:

పండ్లతోటలు, పూల సాగులో అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం, ఆనందపురం గ్రామానికి చెందిన జగన్నాథం రాణిస్తూ ఇతర రైతులకు ఆదర్శం గా నిలుస్తున్నారు. జగన్నాథం కొంత కాలం క్రితం దుస్తుల వ్యాపారం చేసేవారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో వ్యవసాయం చేయాలని భావించారు. అయితే తనకంటూ సెంటు భూమి కూడా లేకపోవడంతో వేపాడ మండలం నీలకంఠరాజపురం గ్రామ సమీపంలో సుమారు ఏడెకరాల భూమిని రైతుల నుంచి లీజుకు తీసుకున్నారు. ఈభూమిలో మూడేళ్లుగా వివిధ రకాల పండ్ల తోటలు, పూలను సాగు చేస్తున్నారు. రెండెకరాల్లో అలహా బాద్ సఫేజా, తైవాన్ పింక్ రకాలకు చెందిన జామి మొక్కలు నాటారు. ఇవి ఎనిమిది నెలల్లోనే కాపు వచ్చాయి. మరోరెండు ఎకరాల్లో డ్రాగన్ నిమ్మ, రెండు ఎకరాల్లో సీతాఫలం, సపోట మొక్కలు నాటారు. పొలంగట్టు చుట్టూ అరటి మొక్కలు నాటారు. ఎకరా భూమిలో రేగు మొక్కలను సాగు చేస్తున్నారు. అంతర పంట లుగా కర్బూజ, వివిధ రకాల పూలమొక్కలను సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నారు. వివిధ పంటలపై ఈ మూడేళ్లలో సుమారు రూ.20 లక్షలు పెట్టుబడి పెట్టానని, దాదాపు పెట్టుబడి చేతికొచ్చిందని, ఇకపై వచ్చే ఆదాయం లాభంగా ఉంటుందని రైతు జగన్నాథం చెబుతున్నారు. ఈ ఏడాది జామిలో కర్బూజ అంతర పంటగా సాగు చేయగా, ఎకరానికి 25 టన్నుల దిగుబడి వచ్చిందని వివరించారు. ప్రస్తుతానికి పండ్లతోటల సాగు ఆశాజనకంగానే ఉందని చెప్పారు.

ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు

రాజాం: మండలంలో ని పలు గ్రామాల్లో ప్ర త్యేకావసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నారు. నెలరోజులుగా కొనసాగుతున్న ఈ సర్వేలో ఇప్పటివరకు మొత్తం 32 మంది దివ్యాంగ చిన్నారులను గుర్తించినట్లు ఎంఈవోలు ప్రవీణ్‌కుమార్, యాగాటి దుర్గారావు తెలిపారు. భవిత కేంద్రం ద్వారా ఈ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించడంతో పాటు బిహేవియర్ మాడిఫికేషన్ చేయడం, ఫిజియో, స్పీచ్ థెరపీలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆదివారం స్థానిక మల్లిఖార్జున కాలనీలో చేసిన సర్వేలో ఐఈడీ ఉపాధ్యాయులు ఎస్.హరిబాబు, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాసన పోటీలు



బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

రాజాం సిటీ: స్థానిక శ్రీకాకుళం రోడ్డులోని యోగా వికాస్ కేంద్రంలో విద్యార్థులకు యోగాసన పోటీలతో పాటు భగవద్గీత శ్లోకాలు, ప్రార్థనా శ్లోకాల పోటీలు ఆదివారం నిర్వహించారు. సబ్ జూనియర్ విభాగంలో 4, 5 తరగతుల విద్యార్థులకు, జూనియర్ విభాగంలో 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి సెంట్రల్ కమిటీ సభ్యుడు టి.టి.వి.రమణమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు వెలికితీసేందుకు ఈ తరహా పోటీలు ఉపయోగపడతాయన్నారు. యోగాసనాలతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలగడంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. ప్రతీ విద్యార్థి రోజులో ఎంతో కొంత సమయం యోగాసనాలు వేసేందుకు కేటాయించాలని తెలిపారు. కార్యక్రమంలో యోగా వికాస్ నిర్వాహకులు కొరికాన శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ రాజాం అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.